పాపభారం

[కథానిక]

= శ్రీ 'అమరేంద్ర' =

"ఇంకా రాలేదా? ఇంకా రాలేదా?" అని తల్లి మూల్గింది.

"వచ్చే వేళయింది. ఈ పాటికి సగందోవలో వుంటుంది. వస్తుందమ్మా, కొంచెంసేపు కళ్లు మూసుకుని పడుకో" అని కూతురు శారద తల్లిపక్కలో కూచుని విసురుతూ బదులు చెప్పింది.

"అమ్మాయీ, నీకు తెలియదే తల్లీ, నీకు తెలియదు. కళ్లు మూసుకుంటే ఇక తెరవటం ఉండదమ్మా. మూసుకు పోతుంటే బలవంతాన తెరుచుకుంటున్నాను అది వస్తుందేమోనని. ఇంకారాలేదేమే? అసలు రాదేమో?"

"వస్తుందమ్మా, తప్పకుండా వస్తుంది. ఎక్కడున్నా వెతికి తీసుకురమ్మని మనుషుల్ని పంపాను. ఈ పాటికి వచ్చేస్తూ వుంటుంది."

"ఇక నాకు వ్యవధి లేదే తల్లీ! అంతా అయిపోయాక వస్తుందేమో? అయ్యో! ఇంకా రాలేదేమే? ఇంకెప్పుడు వస్తుందే?" అని ఆందోళనతో వణికిపోయి, సొమ్మసిల్లి, క్షణంసేపు మాట్లాడకుండా పడుకున్నది. శారదకు ఏమీ పాలుబోవటం లేదు. తల్లి ధోరణి చూస్తుంటే భయం వేస్తోంది. ఆమె బతకదని వైద్యులంతా నిర్ధారణచేసి ఆశవదులుకున్నారు. అప్పటినుంచీ శారదమనసు మనసులోలేదు. తనను కంటికి రెప్పగా కాపాడి పెంచిన తల్లిని విడిచిపెట్టి తానొక్కత్తే ఈ లోకంలో ఎల్లా బతకగలదు? తండ్రి స్వర్గానికి తరలివెళ్లినప్పటినుంచీ తల్లితప్ప వేరే ప్రపంచమే శారదకు తెలియదు. అటువంటి తల్లి మరణకాలంలో కోరిన కోరిక తాను నెరవేర్చకపోతే ఎల్లాగు? శారదను చిన్నప్పుడు ఎత్తుకుని సాకిన దాసీ ఒకతె వుంది. అది తమ ఇంట్లోనేవుండి శారదకు నాలుగోయేడు వచ్చేదాకా పెంచింది. దాని భర్త కలరా తగిలి చచ్చిపోయిన తరవాత దానికి మతి చలించిపోయింది. ఎంత వద్దన్నా వినకుండా తన పిల్లల్ని వెంటపెట్టుకుని ఆ వూరు విడిచి వెళ్లిపోయింది. ఇది పదేళ్లకిందటి సంగతి. అప్పటినుంచీ ఆ దాసీదాని జాడ తెలియలేదు. ఈ పదేళ్లలోనూ ఆ దాసీదాన్ని గురించి తల్లి శారదతో ఒక్కమాటయినా మాట్లాడలేదు. తాను బతకనని తెలుసుకున్నదగ్గరనుంచీ ఆ దాసీదానికోసం తల్లి ఒక్కవరసన తపిస్తోంది. మరణసమయంలో ఆప్తబంధువుకోసమైనా అంతగా పరితపించరేమో! ఎప్పుడో పదేళ్లకిందట పని మానకుని ఎక్కడికో వెళ్లిపోయిన దాసీదానికోసం తల్లి అంత తహతహపడటం చూస్తుంటే శారదకు ఏమీ తెలియటంలేదు. తల్లి మళ్లీ అందుకున్నది: "అమ్మాయీ, ఇంకా రాలేదుటే? ఇంక రాదేమో? నాకు వ్యవధి అయిపోతోందమ్మా, ఇంకా రాదే?" శారద తల్లితలకింది దిండును సరిజేసి "వస్తుందమ్మా, తప్పక వస్తుంది, నువ్వు ఆందోళనపడబోకు. ఎక్కడ వున్నా గాలించి తీసుకొస్తాం" అంటుండగానే బైట అడుగుల అలికిడి వినబడింది. వెతకటానికి వెళ్లిన మనుషులు దాసీని వెంటబెట్టుకుని వచ్చారు. ఆ రేగిపోయిన చింపిరితలా, చినిగి పీలికలైపోయిన చీరే, చిక్కిపోయిన రూపూ

చూడగానే శారదగుండె చివుక్కుమన్నది. అమాంతంగా పన్నేళ్ల నాటి చిన్నపిల్లలాగే శారద "లక్ష్మీ"అని కేకపెట్టి పరిగెత్తింది. దాసీది తాను పెంచిన పాప పద్నాలుగేళ్ల పడుచుగా మారటం చూసి విస్తుపోతూ నిలబడిపోయింది. మంచంమీదినుంచి తల్లి "వచ్చిందా" అని పెగుల్చుకుని అరిచి ముంజేతులమీద అమాంతం లేచి కూర్చోబోయింది. దాసీది పరుగున వెళ్లి "అమ్మగారూ, వచ్చాను. మీపాదాలకాడికి మళ్లీ వచ్చాను. నన్ను మరచిపోయారనుకున్నాను" అని రోగిపాదాలు కళ్లకద్దుకుంది. రోగి నీరసించిపోతున్న గొంతుతో "లక్ష్మీ...నిన్నా...మరచి..." అంటూ దాసీదాని చేతులను తన చేతుల్లోకి తీసుకుని దాని కళ్లలోకి రెప్పవాల్చకుండా చూసింది. ఏదో చెప్పబోయింది. పెదవులు వణికినయ్. ధ్వని పెగిలిరాలేదు. ఇంతలోనే చేతులు కట్టెబారిపోయినయ్. నిలువుగుడ్లు పడినయ్. దాసీది 'అమ్మగారూ' అని ఘొల్లుమన్నది. శారద 'అమ్మా' అని ఒక్క శోకం పెట్టింది. మాటలకు లొంగని బాధ ఏదో ఆశవంలోపలే అణగిపోయింది. ఎందుకోసం దాసీదాన్ని పిలిపించిందో, ఎందుకు దాన్ని చూడాలని ఒక్కవరసన కలవరించిందో ఎవరికీ తెలియదు. కలవరించిన దాసి వచ్చి కంటపడేసరికీ ఆ రోగికి కాలం తీరిపోయింది. దట్టంగా అలుముకుంటున్న చీకటిలో శారదా, లక్ష్మీ ఒకరికేసి ఒకరు చూసుకుంటూ, ఏడుస్తూ దరితెలియని అయోమయంలో పడిపోయారు. శవం మాత్రం నిశ్చలంగా వుంది తనకిక చీకటివెలుగుల భేదమేమీ లేనట్లు!

౨

"దాచలేను, ఇంక దాచలేను" అన్న మాటలతో గది అంతా గింగురుమన్నది. ఆ మాటలు ఎంతో బాధతో క్రుంగిపోతున్న గుండెలోతులలోనుంచి దూసుకొనివచ్చినయ్. అద్దంలో, మల్లెపూల రెక్కలకంటె తెల్లని దుస్తులలో వున్న తన నీడను చూసుకుంటోంది మార్గరెట్. ఎదురుగా గోడమీద ఉన్న క్రీస్తుబొమ్మ అద్దంలో కనబడుతోంది. శిలువమీద నిలబడి దారుణమైన బాధతో, దీనమైన ముఖంతో, తడిసిన కళ్లతో క్రీస్తు తన మనసులోకి తొంగిచూస్తున్నాడు. ఆ చూపుకు అందకుండా ఏ పాపం దాగుతుంది? ఆ పవిత్రమైన కాంతిలో ఏ మలినం మాయమైపోదు? ఆ చూపు నర్సుమార్గరెట్ గుండెను చీల్చివేసింది. ఆమె కళ్లకు ఒక్కసారిగా ఇన్నాళ్లనుంచీ తన తెల్లటి వేషంలో దాగిన పాపమొకటి కొట్టవచ్చినట్లు కనబడింది. అణుచుకోలేని ఆవేశంతో ఆమె చిందులు తొక్కసాగింది. ఆమెలోపల దాగిన విషసర్పమొక్కసారిగా ప్రతిరక్తనాళాన్నీ బద్దలుకొట్టి బైటపడాలని బుసలుకొడుతోంది. వణికిపోతున్న కనురెప్పల నొకసారి పైకెత్తి చేతులు జోడించి "ప్రభూ! నిన్ను మోసగించలేను" అని గద్గదస్వరంతో విన్నవించుకున్నది. దూరంగా చర్చిగంట మోగింది. ప్రాణప్రదంగా దాచుకునే బైబిలును చేతపుచ్చుకుని మార్గరెట్ వడివడిగా నడిచిపోయింది.

దోవలో తననుతాను నిందించుకుంటూ అడుగు వేసింది. "ఈ నాడు అగ్నిపర్వతంలాగా బద్దలై నా పాపం బైటపడిపోతుంది. నా కలుషాన్ని కన్నీటితో కడిగివేస్తాను" అనుకుంటుండగా మతగురువు ఎదురైనాడు. మార్గరెట్ అతన్ని దారిలోనే నిలవేసింది. ఆమెకల్లోలాన్ని గమనించి మతగురువు విషయమేమిటి అన్నాడు. మార్గరెట్ వణికిపోతూ అన్నది: "నేనొక గొప్పపాపం చేశాను. అది మీ ముందు బైటపెట్టుకుందామని వచ్చాను. ఈ పాపభారాన్ని భరించలేను." మతగురువు చకితుడై "ఏమిటే, నర్సులు పాపం చేస్తారా?" అన్నాడు వాళ్లమీద తనకున్న గౌరవాన్ని వెల్లడిస్తూ. మార్గరెటు సిగ్గుతో తల వంచుకుని "ఇంత పవిత్రమైన వేషంలో ఎంత పాపం దాగివుందో! నిజం చెబుతున్నాను. వినండి. విని నాకు ప్రాయశ్చిత్తం విధించండి. ఈ పాపభారంతో నే నిక జీవించలేను. నన్ను అనుగ్రహించండి" అని దీనంగా వేడుకున్నది. మతగురువు కరుణతో కరిగిపోతున్న మనసుతో మార్గరెటు హృదయసంక్షోభమంతా విన్నాడు. అంతా చెప్పినాక మతగురువుకు మోకరిల్లి "నాకు మనశ్శాంతి

"లేదా? నాకు విముక్తి లేదా" అని ప్రశ్నించింది. "లేకేమి? ఉంది, ఉంది" అని మతగురువు ఆశకలిపించాడు. "ఏమిటో చెప్పండి. ఎంత కఠినమైన ప్రాయశ్చిత్తం విధించినా సహిస్తాను" అని మార్గరెటు వేడుకున్నది. మతగురువు దయతో నిండిన కంఠంతో "ఎవరికి ఎడబాటు కలిగించావో వారిని వెళ్లి క్షమార్పణ వేడుకో. నీకు మనశ్శాంతి లభిస్తుంది" అన్నాడు. దూరంగా మళ్లీ చర్చిగంటలు గణగణ మోగినయ్. వాటితో కలిసిపోయి మార్గరెటుమనసుకూడా ఆశతో ఝుణఝుణ మన్నది.

ప్రార్థనలు ముగియగానే మార్గరెట్ పరుగు తీసింది. "ప్రపంచంలో ఎక్కడ వున్నా సరే వాళ్ల దగ్గరికి పోయి కాళ్ల మీద పడతాను. కన్నీళ్లతో నా పాపకథ వినిపిస్తాను. వాళ్ల గుండెలు కరిగించి క్షమాభిక్ష వేడుకుంటాను" అనుకుంటూ బయలుదేరింది.

దొరికింది, దొరికింది. అణచివేసే పాపభారం నుంచి బైటపడే దోవ దొరికింది!

3

"శాంతమ్మగారూ! శాంతమ్మగారూ!" అన్న పిలుపు విని శారద బెదిరిపోయింది; కంపించిపోయింది. తల్లి పోయి ఎంతోకాలమైతే ఇవాళెవరో వచ్చి ఆవిడను పేరుపెట్టి పిలుస్తున్నారు. మళ్లీ అదేపిలుపు: ఇందాకటికంటె బిగ్గరగా. లక్ష్మి పరుగుపరుగున వెళ్లి వచ్చి "ఆసుపత్రిలో దొరసానిగారు వచ్చారమ్మా. వారిచేతిమీద ఎన్నో పురుళ్లు పోసుకున్నాను. అమ్మగారికోసం వచ్చారంట. అరుగో వారే వస్తున్నారమ్మా" అని చెప్పింది. నడచినడచివచ్చిన బడలికతో నర్సు మార్గరెట్ లోపలికి వచ్చింది. రాగానే నలువైపులా తేరిపారజూచింది. శారదను చూడగానే ఆమె ముఖంలో ఒక్క మెరుపు మెరిసింది. పధ్నాలుగేళ్ల నాడు తాను బొడ్డుకోసిన పసిపాపయేనా ఈ యువతి?

"కూర్చోండి, ఏం పనిమీద వచ్చారు?" అని శారద మర్యాదగా పలకరించింది. లక్ష్మి కుర్చీ తెచ్చి మార్గరెట్‌ను కూర్చోమన్నది. వద్దని ఆమె నేలమీదనే చతికిలబడి "శాంతమ్మగారు చనిపోయారా పాపం?" అన్నది. శారదకూ, లక్ష్మికీకళ్లనిండా నీళ్లు తిరిగినయ్. ఏమీ మాట్లాడలేక కళ్లు అద్దుకుంటూ నిలబడ్డారు. కొంచెంసేపున్నాక మార్గరెటు "అమ్మాయీ, ఇల్లా రా అమ్మా, కూచో, నీపేరేమిటి?" అంది. శారద చెప్పేలోగానే లక్ష్మి అందుకుని "అమ్మగారు మనసుపడి శారద అని పెట్టుకున్నారు. లేకలేక కలిగారని అమ్మాయిగారంటే అమ్మగారు ప్రాణం విడిచేవారు" అన్నది. ఆ మాటలు వింటుంటే మార్గరెట్‌కు కొరడా దెబ్బ తగిలినట్లనిపించింది. "నీ పేరేమిటమ్మా" అని దాసీని అడిగింది. "దొరసానిగారూ, నా పేరు లక్ష్మి. మీరు మరిచిపోయారేమో గాని నేను మరిచిపోలేనమ్మా. మీ చేతిమీదుగా ఎన్నో పురుళ్లు పోసుకున్నాను. మీ ఋణం ఎన్నిజన్మలకైనా తీర్చుకోలేను దొరసానిగారూ!" పాపం పుణ్యం ఎరగని అమాయక స్త్రీ తనను మెచ్చుకోవటం వింటుంటే మార్గరెట్‌కు తన మీద తనకు మితిలేని రోత కలిగింది. తన పాపాన్ని తలుచుకుంటే గుండె భగ్గుమంటున్నది. ఇంతలో దాసీని "దొరసానిగారూ, ఏమైనా పనిమీద వచ్చారా శెలవియ్యలేదు" అన్నది. మార్గరెట్ మాట్లాడలేకపోయింది. ఎంతో ప్రయత్నించి "నీతోనే పనివుండి వచ్చాను లక్ష్మీ" అంది. "నాతోనా, దొరసానిగారూ, నాలాటి దిక్కుమాలినవాళ్లతో తమలాటి మహారాజులకి పనేమిటండీ" అని లక్ష్మి దీనంగా అడిగింది. మార్గరెటు మారుచెప్పలేదు. దూరంగా నిలబడి అంతా వింటున్న శారదకేసీ, దగ్గరున్న లక్ష్మికేసీ తేరిపారజూచింది. ఆమెకళ్లు తడిసినయ్. "శారదా! ఇల్లా రా, తల్లీ. మీ అమ్మ చనిపోలేదు; చనిపోలేదు. నిన్ను మీ అమ్మదగ్గరికి తీసుకుపోతా రా" అంది. ఈ మాట విని శారద నివ్వెరబోయింది. "ఏదీ మా అమ్మ?" అని అప్రయత్నంగా అడిగింది. "తొందరపడకమ్మా, నీకు మీ అమ్మను చూపిస్తాను" అంది మార్గరెట్. లక్ష్మి ఆశ్చర్యంతో కళ్లు ఇంతచేసి గోడకు ఆనుకుని నిలబడింది.

"పధ్నాలుగో ఏడు కామా శారదా నీకు?" అని అడిగింది నర్సు. అవునని శారద తల ఊపింది.

"అవునవును, పధ్నాలుగే. ఆకానుపు నాకూ, అమ్మగారికీ ఒక్కసారే వచ్చింది. ఇద్దరం ఒక్కరోజే కన్నాం. నాపిల్ల చచ్చిపోయేపుట్టింది" అని లక్ష్మి మార్గరెటుముఖంలోకి చూసింది. ఇది వినగానే నర్సు గుండెలలో కత్తితో పొడిచినట్లయింది. గిర్రున కళ్లలో నీరు తిరిగింది. అమాంతంగా లక్ష్మిపాదాలను చేతులతో చుట్టివేసి "నన్ను క్షమించు తల్లీ, నన్ను మన్నించు" అని వణికిపోతున్న కంఠంతో అరిచింది. లక్ష్మి తత్తరపాటుతో "లేవండి దొరసానిగారూ, అయ్యో ఇదేమిటి, ఈ దిక్కుమాలినదాని కాళ్లమీద పడతారు? లేవండి" అని దూరంగా జరిగింది. మార్గరెట్ శారదగడ్డం పుచ్చుకుని "తల్లీ, నాతప్పు మన్నించవూ?" అని బతిమాలింది. ఏమీ అర్థంకాక శారద ఆశ్చర్యపోతూ అన్నది: "ఏమిటో చెప్పండి. నాకేమీ తెలియకుండా వున్నది." నర్సు "చెబుతాను తల్లీ, అందుకోసమే ఇంతదూరం వచ్చాను. మీముందు సిగ్గుపడను. నాపాపమంతా మీముందు విప్పిచెప్పుకుని కొంచెం మనశ్శాంతి పొందుదామని వచ్చాను. లక్ష్మి, శారదా, మీ అమాయకహృదయాలకు ఈపాపాత్మురాలి మాటలు చాలా ఘోరంగా వుంటయ్. మీముందు నిలబడటానికే సిగ్గుతో చచ్చిపోతున్నాను." అంటుంటే కనుగొనలలో నీరునిండి చెక్కిళ్లమీదుగా రాలినయ్. ఆమెముఖంలో భరింపలేని వేదన, చెప్పలేనంత సిగ్గూ అలముకొన్నయ్.

"దొరసానిగారూ, మీమాటలు వింటుంటే నాకేదో భయం వేస్తోంది. ఎందుకమ్మా అల్లా కళ్లంట నీళ్లు?" అంది లక్ష్మి.

"పధ్నాలుగేళ్ల కిందటి సంగతి నేను చెప్పేది. నీకు గుర్తుందా లక్ష్మి ఎంత బాధపడ్డావో? నీరసించిపోవటంవల్ల నీకానుపు ఎంతో కష్టమైపోయింది. నువ్వెల్లా బతికి బైటపడతావా అని అందరం దిగులుపడ్డాం. చివరకు అర్ధరాత్రివేళ నీకు పురుడువచ్చింది"

"అవును దొరసానిగారూ, గుర్తుంది. చచ్చిపుట్టిన పిల్లను చూసుకుని గొల్లుమన్నాను. ఇప్పుడున్నట్లుంది"

"లేదు, లక్ష్మి, నీపిల్ల చచ్చిపుట్టలేదు. సుఖంగా వుంది"

"మీ మాటలు నాకు తెలియటంలేదు దొరసానిగారూ. చచ్చిపోయిన పిల్లను నేను కళ్లారా చూశాను; కాదంటారేమిటి?"

"లేదు, లక్ష్మి, నీపిల్ల సుఖంగా వుంది. చచ్చిపోయిన పిల్లను నీకు చూపిన పాపాత్మురాలిని నేనే. నీకు ఘోరమైన అన్యాయం చేశాను. దానికే నీకాళ్లమీద పడి క్షమించమని వేడుకుంటున్నాను" అని లక్ష్మిపాదాలను తాకబోయింది. లక్ష్మి వద్దని వారించి "అయితే దొరసానిగారూ, నాపిల్ల నెక్కడ దాచారో చెప్పండి?" అని అడిగింది.

"నీకూ, శాంతమ్మగారికీ ఒకేసారి పురుడు వచ్చింది. నీకు పురుడు వచ్చేసరికీ శాంతమ్మగారు కన్నారు. ఆవిడకు చచ్చిపోయిన శిశువు పుట్టింది. రాకరాక కానుపు వచ్చింది. వచ్చింది వచ్చినట్లుగానే చచ్చిపోయిన శిశువును కన్నది. శిశువును చూసుకుని ఆవిడ ఎంతో దుఃఖించింది. నీకు ఎంత కావాలన్నా ఇస్తాను; నాబిడ్డను బతికించు అని ఎంతో దీనంగా వేడుకున్నది. నాకు ఆతల్లి దుఃఖం చూడగానే గుండె కరిగిపోయింది. ఇంతలో నీగదిలో పిల్ల కెవ్వుమనటం వినిపించింది. పురుడురాగానే పసిపిల్లల బొడ్డు కోసి స్నానం చేయించి, పాపలందరినీ మూడు పూటల దాకా మేమే పెంచుతాం. గుర్తుకోసం పాపలకాలికి తల్లి పేరు రాసిన చీటీ దారంతో కడతాం. పురుడు వచ్చినాక నీకు మత్తువదలలేదు. సొమ్మసిల్లి సోయ తప్పివున్నావు. అప్పుడు ఈ పాపాత్మురాలు ఏం చేసిందనుకున్నావ్? నీ శిశువుకాలికి శాంతమ్మగారి పేరు కట్టి పడుకోబెట్టి శాంతమ్మగారి చచ్చిన శిశువును నీపక్కన పడుకోబెట్టాను. ఇదంతా పైవాళ్లెవరూ చూడకుండా రెప్పపాటులో చేశాను. నీకు స్మృతివచ్చాక నీపిల్ల పోయిందని శోకం పెట్టావు. తన పిల్ల చచ్చిపోయినా, ముద్దులుమూటగట్టే పసిపాప పక్కలోకి వచ్చిందని శాంతమ్మగారు పొంగిపో

యారు. ఆసుపత్రినుంచి ఇంటికి వెళ్లేనాడు నన్ను చాటుగా పిలిచి ఇదుగో ఈ ఆరువందల రూపాయలు లంచమిచ్చారు. అప్పటినుంచీ వాటిని నేను ముట్టుకో లేదు. నాపాపమంతా వాటిల్లోనే దాగి నన్ను క్షణ క్షణమూ శూలంతో పొడిచేది. ఇదుగో లక్ష్మీ, ఈ డబ్బు నువ్వు తీసుకో. దానితో నీబిడ్డలు సుఖపడితే నాపాపం కొంత శమించినట్లే. నామాట వినవూ? తీసుకోవూ?

"శారదా! విన్నావమ్మా నేను చెప్పినదంతా? నన్ను ఏవగించుకుంటున్నావుకదూ? మీకు నేను పిశాచిగా కనబడటంలేదూ? అవును తల్లీ, పాపమెరు గని పసిమనసులకు నావంటి పాపాత్ములు భూతాలుగా కనబడరా మరి? కాని నిన్నొక్కటి వేడుకుంటు న్నాను తల్లీ, ఒక్కసారి నేను వినేట్లుగా లక్ష్మిని 'అమ్మా' అని పిలూ; చెవులారా విని నేచేసిన పాపం కొంత శమించిందని పొంగిపోతాను. శారదా, నిన్ను మీ అమ్మనుంచి ఎడంచేసిన పాపిని నేను. మరొక పరాయిస్త్రీని తల్లిగా భావించి భ్రమపడేట్లుచేసిన పిశా చిని నేను. ఇదుగో ఇప్పుడు నిన్నూ, మీ అమ్మనూ ఒక్కచోటికి చేర్చాను. ఏ చేతులతో మిమ్మల్నిద్దరినీ విడదీశానో ఆ చేతులతోనే మిమ్మల్ని కలిపివేస్తాను. లక్ష్మీ, ఇదుగో నీ బిడ్డ. నువ్వు తొమ్మిదినెలలూ మోసిన బిడ్డ. ఇన్నేళ్లనుంచీ నీకు ఎడమయింది. ఆ ఆపేక్ష అంతా ఒక్కసారిగా తీర్చుకో" అని మార్గరెట్ ఆగి పోయి కళ్లు తుడుచుకుంది.

ఉన్న కుదుటిలోనుంచి ఒక్కసారిగా పెక లించి ఎక్కడికో విసిరివేసినట్లు శారద స్తంభించి పోయింది. అంతా శూన్యంగా కనబడుతోంది. పధ్నాలుగేళ్ల బతుకూ పేకమేడలాగా, నీటిబుడగలాగా ఆ శూన్యంలో కలిసిపోతోంది. "నా తల్లీ, నాతల్లీ!" అని లక్ష్మి శారదను రెండుచేతులతోనూ పసిపిల్లలాగా ఎత్తుకుని ముద్దులతో ఉక్కిరిబిక్కిరయేట్లు చేసింది. లక్ష్మిఆనందం చూస్తున్నకొద్దీ మార్గరెట్‌కు కన్నీరు ఆగటంలేదు. తను తల్లీపిల్లలను విడదీయటంవల్ల ఎంత పాపం చేసిందో ఆ క్షణంలో గ్రహించగలిగింది. అక్కడ నిలవలేక వడివడిగా వెళ్లిపోయింది. శారదా, లక్ష్మి ఎంత బతిమాలినా వెనక్కు తిరగనైనాలేదు. ఆ పాపాన్ని కడిగివేయగల శక్తి కన్నీటి కున్నదా అనుకుంటూ వెళ్లిపోయింది.

గోడమీద వేలాడుతున్న శాంతమ్మగారి ఫోటో ఒక్కసారి కదిలి "అమ్మయ్య!" అని నిట్టూర్చినట్లు వినిపించింది. ఏదో మోయలేని బరువు కిందికి దింపి నట్లు! ఆ బొమ్మకేసి చెమ్మగిలిన కళ్లతో చూస్తున్న శారద అప్రయత్నంగా "అమ్మా" అని పిలిచింది. అమాంతంగా లక్ష్మి వచ్చి శారదను గట్టిగా కౌగిలించు కుంది. తన కౌగిలి నింకెవరు సడలింపగలరు? తన బిడ్డ నింకెవరు దొంగిలింపగలరు? తమ నింకెవరు ఎడం చేయగలరు?